# సంఘటిత నేరాలు - సహజ న్యాయసూత్రాలు

మన రాష్ట్ర అసెంబ్లీ ఈ మధ్యనే ఆమోదించిన "ఆంధ్రప్రదేశ్ సంఘటిత నేరాల నియంత్రణ చట్టం" వల్ల ప్రజలు ఏ హక్కులు కోల్పోతారో తెలుసుకోవాలంటే ఆ చట్టంలోని సెక్షన్లు ఏకరవు పెట్టి ప్రయోజనం లేదు. చట్టాల పరిభాషకు సహజమైన సంక్లిష్టమైన పదబంధాల వల్ల వాటి భావం త్వరగా స్ఫురించదు. దానికి బదులు ఉదాహరణలు తీసుకొని వ్యాఖ్యానించుకోవడం ఉచితంగా ఉంటుంది.

### ఈ చట్టం ఎవరిని శిక్షిస్తుంది?

'కాంట్రాక్ట్ హత్యలు, బలవంతపు డబ్బు వసూళ్ళు, నిషిద్ధ వస్తువుల దొంగరవాణా, గంజాయి వ్యాపారం, డబ్బుల కోసం కిడ్నాప్ చేయడం, నల్లధనాన్ని తెల్లదిగా మార్చడం, ఈ నేరాల నుండి పుట్టిన అక్రమమైన నల్లధనం' - ఇదీ ఈ చట్టం ఎదుర్కొనబోయే రుగ్మత అని దాని పీఠికలో అన్నారు. ఈ నేరాలకు పాల్పడే సంఘటిత నేరబృందాలు రాష్ట్రంలో ఉన్నాయనీ, వాటి దగ్గర పోలీసుయంత్రాంగం కంటే ఆధునికమైన ప్రసార సాధనాలూ సాంకేతిక ప్రక్రియలూ ఉన్నాయనీ అవి ప్రజాజీవితంలో అభద్రతనూ, హింసనూ పెంచుతున్నాయనీ పీఠికలో అన్నారు.

ఇవేవీ లేనేలేవనీ ఈ ఆందోళన కేవలం ఊహాజనితమనీ ఎవరూ అనరు. వీటిని ఎదుర్కొనడం అనవసరం అనికూడా అనరు. నిజానికి పెరుగుతున్న ఈ రకమైన నేరాలపట్ల సామాన్య ప్రజలలో చాలా వ్యతిరేకత ఉంది. ఆ సంగతి ప్రభుత్వానికి తెలుసును కాబట్టే ఆ పేరు మీద ఒక చట్టం చేసేస్తే దాని లోతుపాతులు ఎవరూ చూడరనీ దాని పర్యవసానాల గురించి తర్కించరనీ ప్రభుత్వం ధైర్యం.

అందుకే మనం మరింత జాగ్రత్తగా ఈ చట్టాన్ని విశ్లేషించాలి. మొదట, ప్రభుత్వం చెప్పే 'సంఘటిత నేరాలు' సమాజానికి నిజంగా హానికరమయినవే కానీ మన రాష్ట్ర పాలకులు కేవలం వాటి బాధితులనూ, ఆ నేరాలలో వీరికి కూడా పాత్ర లేదా అన్న ప్రశ్న వేసుకోవాలి. పైన పేర్కొన్న నేరాల జాబితాకు ఇంకొక సారి చదవండి. అరకమైన నేరాలతో ప్రమేయమున్న ఎంఎల్ఏల గురించి, తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీల నాయకుల గురించి, పోలీసు, ఎక్సైజ్, సివిల్ సప్లయిస్, అటవీ శాఖ అధికార్ల గురించి ఎన్నిసార్లు వినలేదు? నిజంచెప్పాలంటే ఆ జాబితాలోని నేరాలు అధికారుల భాగస్వామ్యం కాకపోతే తోడ్పాటు లేకుండా సాగించడం చాలా కష్టం. అటువంటప్పుడు ప్రభుత్వం అమాయకత్వం నటిస్తూ ఆ నేరాలను అరికట్టటానికొక కొత్త చట్టం కావాలంటూ చట్ట సవరణకు పూనుకోవటం ఎందుకు? ఆ నేరాలకు పాల్పడే వారికి రాజకీయనాయకుల, అధికారుల తోడ్పాటు ఉండబట్టే అవి వర్ధిల్లుతున్నాయి.ఈ తోడ్పాటును గుర్తించి దానిని తొలగించడానికి నిజయితీగా కృషి చేసే బదులు చట్టాన్ని సవరించి నేరస్మృతిని అనాగరికంగా తయారు చేయడం ఎందుకు?

కాగా, ఈ చట్టానికి రాసిన పీఠికలో పేర్కొన్న జాబితాలోని నేరాలకే ఈ చట్టం పరిమితమయిందా అనేది చూడాలి. ఈ చట్టంలో సంఘటిత నేరాలకు ఇచ్చిన నిర్వచనం పీఠికలలోని నేరాలకు మాత్రమే అతుకుతుందా? ఎంతమాత్రం కాదు. అనేక రకాల సంఘటిత రాజకీయ కార్యాచరణ సహితం - పెద్దగా హింసాత్మకం కాకపోయినా - ఈ చట్టం కింద 'సంఘటిత నేరం' అవుతుంది.

*(i) హింసగానీ, బెదిరింపుగానీ, బలవంతంగానీ ఇతర చట్టవిరుద్ధ పద్ధతులలైనా ఉపయోగించి*

*(ii) తనకు, లేక మరొకరికి ధనలాభం గానీ, ఆర్థిక ప్రయోజనంగానీ, ఇతర ప్రయోజనంగానీ పొందడంకోసం*

*(iii) ఒకరికంటె ఎక్కువ వ్యక్తులు*

*(iv) ఒకటి కంటె ఎక్కువసార్లు*

*(v) 3 సంవత్సరాల కంటె ఎక్కువ శిక్షపడగల నేరానికి పాల్పడినట్టు కోర్టులో ఛార్జిషీటు దాఖలయి కోర్టుదానిని 'కాగ్నిజన్స్' తీసుకున్నట్టయితే*

ఆ వ్యక్తులను 'సంఘటిత నేర బృందం' అంటారు. అటువంటి సంఘటిత నేర బృందం సభ్యులుగా ఉంటూ, చేసే నేరాలను, లేక దాని తరఫున చేసే నేరాలను 'సంఘటిత నేరాలు' అంటారు. ఇది పీఠికలో పేర్కొన్న నేరాల జాబితాను దాటి చాలా దూరం పోయే చాలా విస్తృతమైన నిర్వచనం అని విడమరచి చెప్పనవసరం లేదు.

ఈ చట్టాన్ని కొన్ని విషయాలలో 'టాడా'తో పోలుస్తున్నాం. నేర విచారణ రెండింటిలోనూ దాదాపు ఒకటే. అయితే నేర నిర్వచనం విషయంలో ఇది టాడా కంటే అన్యాయమయిన చట్టం. టాడా ప్రకారం ఒక నేరం టెర్రరిస్టు నేరంగా గుర్తింపు పొందడానికి తుపాకులు, బాంబులు వంటి ఆయుధాలు ఉపయోగించి ఉండాలి. బాణాలు, వేటకొడవళ్ళు, కట్టెలు ఉపయోగించి చేసే నేరాలు టెర్రరిస్టు నేరాలు కావు. కానీ ఈ చట్టంలో ఆయుధాల ప్రస్తావనే లేదు. హింస ప్రయోగం, బెదిరింపు ఏ రూపంలో ప్రయోగించినా అది సంఘటిత నేరం కాగలదు.

కాగా, 'సంఘటిత నేరం' నిర్వచనం ఎంత విస్తృతమయినదో చెప్పడానికి రెండు ఉదాహరణలు ఇచ్చుకోవచ్చు. పశ్చిమ గోదావరి ఏజెన్సీలో ఆదివాసులు నాలుగేళ్ళుగా ఎల్‌టిఆర్ చట్టం అమలు కోసం ఒక పోరాట రూపం అనుసరిస్తున్నారు. 'మేము లేవదీసిన వివాదానికి పరిష్కారం లభించేంతవరకు మీరు భూమి సాగు చేయడానికి వీలులేదు' అని గిరిజనేతర రైతులను బెదిరిస్తున్నారు. అప్పుడప్పుడు బాణాలతోనో కట్టెలతోనో దేవుడిచ్చిన చేతులతోనో కొట్టడం కూడా కద్దు. వాళ్ళు గుంపుగానే ఈ పని చేస్తున్నారు, పదే పదే చేస్తున్నారు. ఏదో ఒక ప్రయోజనం కోసం చేస్తున్నారు. చట్టం కళ్లలో హత్యాప్రయత్నం చేస్తున్నారు. కాబట్టి వారు చేస్తున్నది ఇక మీదట సంఘటిత నేరం అవుతుంది.

అనేక ఫ్యాక్టరీలలో కార్మికులు చేసే ఆందోళనలు కూడా ఈ విధంగానే 'సంఘటిత నేరాలు' అవుతాయి. ఏవో డిమాండ్లతో కార్మికులు సమ్మె చేస్తారు. గుంపుగా చేస్తారు. (సమ్మె ఒకరు చేయలేరుకదా) సమ్మెకాలంలో దినకూలీలను పెట్టి పనిచేయించుకోవడానికి యాజమాన్యం ప్రయత్నిస్తే 'చంపుతాం' అని బెదిరిస్తారు. ఒకరిద్దరు సూపర్‌వైజర్లనో సెక్యూరిటీ వారినో తన్నినా తంతారు. జీవితంలో ఒక సారి మాత్రమే ఈ దృశ్యాన్ని చూసే ఫ్యాక్టరీ ఏదీ ఉండదు కాబట్టి రెండవ సారి జరిగినప్పటి నుండీ ఆ కార్మికుల ఆందోళన 'సంఘటిత నేరం' అవుతుంది.

## కె. బాలగోపాల్

అయితే ఏం? అని ఎవరయినా అడుగుతారు. ఇప్పుడు మాత్రం ఈ పోరాటాలపైన ఐపిసి కింద కేసులు పెట్టడం లేదా, అరెస్టు చేయడం లేదా? అని అడుగుతారు. కేసులు పెడుతున్న మాట, అరెస్టు చేస్తున్న మాట వాస్తవమేగానీ ప్రధానమైన తేడాలున్నాయి. ఇప్పుడున్న చట్టంలో ఈ రకమైన ఆందోళనలపైన పెట్టగల కేసులు తీవ్రమయినవి కావు. వాటికి శిక్షలు తక్కువ, బెయిలు పొందడం కష్టం కాదు. రెండు, ఇప్పుడున్న చట్టంలో నేరవిచారణ పద్ధతిలో సహజన్యాయసూత్రాలకు సముచిత స్థానం ఉంది. పేదరికం వల్ల న్యాయసహాయాన్ని 'కొనుక్కో'లేక కొంత, న్యాయస్థానాల ఆలోచనా రీతులపైన బలమైన ప్రభావమున్న తిరోగామి భావాజాలం వల్ల కొంత ఈ సహజ న్యాయసూత్రాల ఫలితాన్ని బలహీన వర్గాలకు చెందిన వారు పూర్తిగా పొందలేక పోతున్నారుగానీ సూత్రప్రాయంగా నేర విచారణ పద్ధతి హేతుబద్ధమైనదే. మూడు, ఇప్పుడున్న చట్టంలో ఒక 'నేరానికి' ఉండే సామాజిక స్వభావాన్ని బట్టి (ఉదాహరణకు ఒక భౌతిక దాడి పేదవారి ఆందోళనలో భాగంగా జరిగిందా లేక వట్టి రౌడీయిజం కారణంగా జరిగిందా అని వివేచించి) శిక్ష ఎంత తక్కువయినా వేసే అవకాశం ఉంది. అంటే నేరాలకు గరిష్ట శిక్షేతప్ప కనీస శిక్ష సాధారణంగా ఉండదు.

ఈ మూడు విషయాలలోనూ కొత్త చట్టం అన్యాయమైనది. 'సంఘటిత నేర బృందాలు' చేసే చాలా నేరాలకు శిక్ష అయిదు సంవత్సరాల నుండి జీవితఖైదు దాకా ఉండగలదు. శిక్షకాలం ఎక్కువ ఉండడమే కాక ప్రతీ నేరానికీ భారీగా జుర్మానా కూడా నిర్ధేశించారు. కొన్ని నేరాలకు ఒక లక్ష రూ॥లు వేయాలని నిర్ధేశించగా కొన్నిటికి అయిదు లక్షల రూ.లకు తక్కువ కాకుండ వేయాలని నిర్ధేశించారు. ఖైదు పరిమాణాన్నీ జుర్మానానూ కలుపుకుంటే 'సంఘటిత నేరాల'కు పాల్పడినట్టు రుజువయిన ముద్దాయి కనీసం అయదు సంవత్సరాలు జైలుకు పోవాలి, కనీసం అయిదులక్షల రూ.ల జుర్మానా కట్టాలి. సంఘటిత ప్రజాందోళనల పైన 'సంఘటిత నేరాలు' అంటూ కేసులు పెట్టినట్టయితే ఆందోళనకారులు ఇంత భారీగా మూల్యం చెల్లించవలసి ఉంటుంది. ఇవి కనీస శిక్షలు కాబట్టి న్యాయమూర్తి ఒక వేళ సానుభూతి చూపించాలనుకున్నా దానికి ఈ చట్టం తావులేకుండా చేసింది.

పోతే, నేర విచారణ పద్ధతి నుండి సహజ న్యాయ సూత్రాలన్నిటినీ వెలివేసారు. వాటిని ఒక్కొక్కటీ ఏకరువు పెట్టడం కంటే ఒక ఉదాహరణ తీసుకొని చెప్పుకుంటే బాగుంటుంది. ఒక ఫ్యాక్టరీ కార్మికులు సిబ్బంది కోతకు వ్యతిరేకంగా సమ్మె పిలుపు ఇస్తారు. సిబ్బందిని తగ్గిస్తే తప్ప ఫ్యాక్టరీ లాభదాయకంగా నడవదు. కాబట్టి కోత పెట్టి తీరుతానని యాజమాన్యం అంటుంది. కార్మికులు సమ్మె చేస్తే కాంట్రాక్ట్ కార్మికులను పెట్టి పని చేయిస్తుంది. తమ సమ్మె విఫలం కాకుండా ఉండడానికి కార్మికులు ఆ కాంట్రాక్టర్‌ను హెచ్చరిస్తారు. ఒకడు ఎందుకొచ్చిన గొడవని తప్పుకుంటాడు. పట్టువదలని యాజమాన్యం ఇంకొక కాంట్రాక్టర్‌ను తీసుకొస్తుంది. కార్మికులు వాడిని కూడా హెచ్చరించి తరిమేస్తారు ...... ఇది సంఘటిత నేరమేనని పై నిర్వచనాన్ని ఈ చర్యలకు అన్వయించుకుంటే అర్థం అవుతుంది.

కాబట్టి కార్మికులపైన కొత్త చట్టం కింద పోలీసులు కేసు పెట్టి జైలులో పెడతారు. జరిగిన దానికి కొంచెం చేర్చి కొట్టారనీ, తన్నారనీ, కేసుపెడతారు. కేసు సాధారణ శిక్షాస్మృతి కింద పెడితే ఇటువంటి కేసులలో కనీసం బెయిలు దొరకడం పెద్ద కష్టంకాదు. సాక్ష్యులయిన కాంట్రాక్టర్లు కార్మికులకంటే బలవంతులు కాబట్టి బెయిలు యిస్తే వారిని వీరు బెదిరించి నేర విచరాణను ఆటంకపరుస్తారని కోర్టు తటపటాయించనక్కరలేదు. పైగా ముద్దాయిలు వృత్తినేరస్తులు కారు కాబట్టి న్యాయనిర్ణయానికి దొరకకుండా పోతారని భయపడనక్కరలేదు.

అందువల్ల బెయిలు దొరకడం కష్టం కాకూడదు. అయితే ఈ కొత్త చట్టం కింద బెయిలు విషయంలో కోర్టులు అనుసరించే ప్రమాణం వేరు. కేవలం నేరవిచారణను ఆటంకపరుస్తారా లేదా అన్నది ప్రమాణం కాదు. ముద్దాయి నిర్దోషి అనీ, విడిచి పెడితే మళ్ళీ నేరం చేయడనీ కోర్టు భావిస్తేనే బెయిలు ఇవ్వాలి. అంతటి విశ్వాసం ఖైదీపైన కోర్టుకు ఉండనక్కరలేదు కాబట్టి బెయిలు దొరకడం దాదాపు అసాధ్యం.

ఇంకొక రకంగా చెప్పాలంటే నేరం రుజువయ్యేవరకు ముద్దాయి నిర్దోషేనన్నది సాధారణ నేరస్మృతి వైఖరికాగా, నిర్దోషిత్వం రుజువయ్యే వరకు ముద్దాయి నేరస్తుడేననేది ఈ కొత్త చట్టం వైఖరి.

బెయిలు రాకుండా జైలులో ఉన్న కార్మికులను 'విచారణ' నిమిత్తం పోలీసులు తమ కస్టడీకి తీసుకుంటారు. ఎస్.పి.గారి దగ్గరకు తీసుకుపోతారు. కాంట్రాక్టర్లను బెదిరించింది నిజమేనని ఒప్పుకోకపోతే ముడ్డిలోకి మూతి పగుల గొట్టిన సీసాలు ఎక్కిస్తామనీ, కరెంటు షాక్ పెడతామనీ బెదిరిస్తారు. అంతపనీ చేసి చూపిస్తారు కూడా. బతికుంటే బలుసాకు తినొచ్చునన్న మానవ సహజమైన భావనతో కార్మికులు నేరం ఒప్పేసుకుంటారు. పోలీసులు దానిని ఒక కాగితం పైన టైప్ చేసి తెస్తారు. కార్మికులు ఆ కాగితం పైన సంతకం చేస్తారు.

ఈ రకమైన 'ఒప్పుకోలు' మామూలుగా సాక్ష్యంగా చెల్లుబాటుకాదు. కానీ కొత్త చట్టం కింద అది చెల్లుబాటవుతుంది. ఎవరి చేతా నేరం బలవంతంగా ఒప్పించడానికి వీలు లేదన్న రాజ్యాంగ ప్రాథమిక హక్కుకిది వ్యతిరేకం (సుప్రీం కోర్టు కాదన్నప్పటికీ)

ఆ తరువాత ఛార్జీ షీటు పెడతారు. కాంట్రాక్టరు బెదిరించగా లేక కొట్టగా చూసిన వారు ఎవ్వరన్న విషయం అందులో ఉండదు. వారికొక సాక్షినెంబరు ఇస్తారుగానీ వారి పేరు, పత్తా (చిరునామా) ముద్దాయిలకు చెప్పరు. అంటే వారి వాంగ్మూలం అసత్యమని రుజువు చేసే అవకాశం ముద్దాయికి ఉండదు.

పోను పోను విచారణ మొదలవుతుంది. కోర్టులో కాదు, జైలులోనే జరుగుతుంది. అంటే కోర్టే జైలులో వచ్చి కూర్చుంటుందని అర్థం. ముద్దాయిల బంధువులుగానీ విలేకరులుగానీ ఇతర ప్రజలుగానీ విచారణ చూడలేదు. సాక్షినెంబరే తప్ప పేరు లేని సాక్షులు ముఖానికి స్క్రీన్ అడ్డంపెట్టుకొని 'ఆకాశరామన్న' సాక్ష్యం చెప్తారు. ఆకాశరామన్నను క్రాస్ ఎగ్జామిన్ చేయడం సాధ్యం కాదుగదా!

పోలీసులు కూడా తమ వంతు సాక్ష్యం ప్రవేశపెడతారు. ప్రవేశపెట్టే ముందు దానిని కల్పిస్తారు. జైలులో ఉన్న ముద్దాయిలను పోలీసు కస్టడీకి ప్రశ్నించే నిమిత్తమని చెప్పి తీసుకొని నేరం జరిగిన స్థలానికి తీసుకుపోయి అక్కడొక బండమీదనో, చెట్టుమీదనో, కుర్చీ మీదనో వేలిముద్ర వేయిస్తారు. ఆ తరువాత ఆ వేలి ముద్రకు సంబంధించిన సాక్ష్యం కోర్టులో ప్రవేశపెడతారు. మామూలుగానయితే అటువంటి సాక్ష్యానికి కోర్టులలో స్వతంత్రమైన విలువ ఏమీ ఉండదు. కానీ చట్టంలోని సెక్షన్ 22(1)(6) ప్రకారం నేరస్థలంలో వేలి ముద్రలు లభిస్తే ఇంక నేరం చేసినట్టే కోర్టు భావిస్తుంది. చేయలేదని రుజువు చేసుకునే బాధ్యత ఆపైన ముద్దాయిల పైననే ఉంటుంది.

ఇవన్నీ కలుపుకుంటే మనం ఉదాహరణగా తీసుకున్న కార్మికులు శిక్ష తప్పించుకునే అవకాశం లేదని స్పష్టమవుతుంది. అయితే వాళ్ళు నేరం చేసారని జడ్జినమ్మినా ఆ నేరానికి ఉన్న సామాజిక స్వభావాన్ని బట్టి తక్కువ శిక్ష వేయాలని అనుకునే అవకాశం ఉంది. సాధారణ చట్టం కింద పెట్టిన కేసయితే జడ్జి ఆ పని చేయవచ్చు. మొదట్లో చెప్పినట్టు సాధరణ నేర స్మృతిలో నేరాలకు గరిష్ఠ శిక్షే తప్ప కనీస శిక్ష ఉండదు. కానీ ఈ కొత్త చట్టం కింద న్యాయమూర్తి ఏమనుకున్నా 5 సంవత్సరాల శిక్ష వేయవలసిందే. ఒక లక్ష రూ.లకు తక్కువ కాకుండా జుర్మానా వేయవలసిందే.

ఈ అన్యాయాన్ని ఆ కార్మికులు పత్రికల ద్వారానయినా బయట పెట్టవచ్చుననుకుంటున్నారా? అంటే కోర్టులో స్వేచ్ఛ కోల్పోయినా ప్రజాభిప్రాయంలో సానుభూతి పొందవచ్చుననుకుంటున్నారా? వారి ప్రకటనను ఏ పత్రికలో ప్రచురించడానికి వీలులేదు. ఒక సారి ఆ కార్మికులు 'సంఘటిత నేర బృందం'గా గుర్తింపు పొందిన తరువాత (అంటే రెండవ కాంట్రాక్టర్‌ను బెదిరించి తరిమేసిన తరువాత) వారు ఇచ్చిన ప్రకటనను ప్రచురించడం వారి నేరాలకు సహకరించడమే అవుతుందని ఈ చట్టంలోని సెక్షన్ 2(i)(ఎ)(ii) అంటుంది. దానికి కూడా అయిదు సంవత్సరాల కనీస జైలు శిక్ష, లక్షరూపాయల కనీస జుర్మానా నిర్దేశించారు. దిక్కుమాలిన కార్మికుల కోసం - వారి గొంతు వినిపించడం కోసం - అంత శిక్ష భరించడానికి ఏ దిన పత్రిక సిద్ధంగా ఉంటుంది? *